# సంబంధాల్ని ప్రభావితం చేస్తోన్న నమ్మకాలు

నమ్మకానికి మించింది లేదు. భార్యభర్తల మధ్య సంబంధాన్ని పిల్లలు, దైవం బాగా ప్రభావితం చేసినట్టే స్వలింగ సంపర్కుల మధ్య బాంధవ్యాలు కూడా వీటి ప్రభావానికి లోనవుతున్నాయి. ఇల్లినాయిస్ యూనివర్శిటీకి చెందిన డాక్టర్ ఓస్వాల్ బృందం ఈమధ్య జరిపిన సర్వే కొన్ని ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడిచేసింది. పిల్లల సంరక్షణ దైవత్వానికే స్వలింగ సంపర్కులు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తున్నారు. జీవిత భాగస్వాముల్ని విడిచి తమకు ఇష్టమైన వారితో కలిసి జీవించేటప్పుడు కొంచెం సంఘర్షణ పడినా, తమ ఇరువురి సంతోషం కోసం, తమతోపాటు వచ్చిన సంతానం సంతోషం కోసం స్వలింగ సంపర్కులు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం ఈ సర్వేలో గమనించాల్సిన విషయం. వ్యక్తిగత ఇష్టాయిష్టాలని అంతగా పట్టించుకోవడం లేదు. నమ్మకం, పరస్పర విశ్వాసం, న్యాయపరమైన చిక్కుల నుంచి బయట పడడానికి ఈ జంటలు పరస్పర అంగీకారంతో ముందుకు నడుస్తున్నాయి. స్వలింగ వివాహాల కారణంగా సంప్రదాయం మట్టికొట్టుకుపోతోందని గగ్గోలు పెడుతున్నవారూ వున్నారు. అయితే తమ సంబంధాలన్నీ న్యాయ సమ్మతం కావాలంటే సంప్రదాయబద్ధంగా వ్యవహరించాలని వారు కోరుకుంటున్నారు. ఒకరిమీద ఒకరు ఆధిపత్యం చలాయించుకోకుండా తాము కోరుకున్న కొత్త జీవితం తమ సొంతం కావడానికి ఆధ్యాత్మికతకి వారు పెద్ద పీట వేస్తున్నారు.

# రాణిగారిలా మాట్లాడాలని

కాకి పిల్ల కాకికి ముద్దు అన్న చందంగానే మన గొంతు అంటే మనకి ఎంతో అభిమానం. అదే బ్రిటన్ వాసులనడిగితే తామంతా తమ రాణి ఎలిజిబెత్‌లా మాట్లాడాలనుకుంటున్నామని, ఆమె మాట్లాడినట్టుగా రకరకాల శబ్దాలు చేయాలనుకుం టున్నామని చెప్తారు. బర్మింగ్‌హాం ఉచ్చారణలా మాట్లాడడానికి ఎవరూ ఉత్సాహం చూపలేదు. బ్రిటిష్ ఉచ్చారణకి ప్రాధాన్యత ఇచ్చే ఎలిజబెత్ గారిని జనం ఎక్కువగా అనుకరిస్తున్నారని ఓ సర్వేలో వెల్లడైంది. ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఈ సర్వేలో 2181 మంది పాల్గొన్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో 73శాతం మంది తమ సొంత గొంతు కంటే రాణిగారి గొంతులా మాట్లాడడానికే బాగా ఉత్సాహం చూపిస్తున్నట్టు తేలింది. అచ్చులు, హల్లుల్ని రాణిగారు ఎలా పలుకుతారో ప్రజలు కూడా అలాగే పలకడానికి ప్రయత్నిస్తున్నారు. స్కాటిష్ ఉచ్చారణ తర్వాత ఐరిష్ ఉచ్చారణకు జనం మొగ్గుచూపుతున్నారు. స్పిన్‌వాక్స్ అనే సంస్థ ఈ సర్వే నిర్వహించింది.

'సరసి'కత

వైశంపాయనుడు పెళ్లయిన కొత్తలో బెంగళూరు వెళ్లాడు. స్టేషన్లో పరాంకుశం మేస్టారు కలిశారు.

''ఏమిటోయ్ ఇలా వచ్చేవ్?'' అని ప్రశ్నించారాయన.

''హనీమూన్ కొచ్చానండీ'' అన్నాడు వైశంపాయనుడు సిగ్గుపడుతూ.

''ఓహో కంగ్రాచ్యులేషన్స్ ! ఎప్పుడైందయ్య పెళ్లి?''

''మొన్ననే సార్. సారీ మిమ్మల్ని పిలవలేకపోయాను''

''ఫరవాలేదులేవోయ్. ఇంతకీ మీ ఆవిడేదీ? '' అతని చుట్టుపక్కల కళ్లతో వెతుకుతూ ప్రశ్నించారు పరాంకుశంగారు.

''అది కూడా ఎందుకండీ? బోల్డు ఖర్చని నేనే వద్దన్నాను'' అన్నాడు వైశంపాయనుడు.

# హనీమూన్



మేస్టారు ఆశ్చర్యపోయారు.

''చూడు బాబూ ! మెదటిసారి పెళ్లయిన మూలాన నీకు తెలియదు. హనీమూన్‌కి ఇద్దరూ రావాలయ్యా. ఒక్కరే వస్తే అది హనీమూనెందుకవుతుందీ?'' అన్నారాయన చిరునవ్వుతో.

వైశంపాయనుడు ఒక్కక్షణం ఆలోచించి ''సరేలెండి. నేను వెళ్లి పంపిస్తాను''అన్నాడు.

''పంపిస్తావా? ఎవర్ని?'' మేస్టారు మళ్లీ ఆశ్చర్యపోయారు.

''మా అమ్మనీ, మా ఆవిణ్ణీ !'' అన్నాడు వైశంపాయనుడు సీరియస్‌గా.

*